## మండలంలో జిపివోల నియామకం

**నంగునూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** మండలంలోని 20 రెవెన్యూ గ్రామాలకుగానూ 11 క్లస్టర్లను ఏర్పాటు చేసి గ్రామ పాలన అధికారులు(జీపీఓ)ల నియామకం చేపటినట్లు తహశీల్దార్ సరిత శుక్ర వారం తెలిపారు. ఈ నియామకల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.క్లస్టర్ల వారీగా నియమించ బడిన ప్రత్యేక జీపీఓల వివరాలను ఆమె వెల్లడించారు. కొండంరాజుపల్లి, ఖాతా ఎన్.మమత, ఘనా పూర్, అక్కన్నపల్లి ఎం.శ్రీనాథ్, గట్లమల్యాల, సంతోష్‌నగర్ జి.రమేష్, నంగునూర్, సిద్దన్నపేట డి.దేవరాజు, ఖానాపూర్, నాగరాజుపల్లి అంక్షాపూర్ అంజనేయులు, నర్మెట, మైసంపల్లి, అప్పలాయి చెరువు ఎన్.సాయిలు, ముండ్రాయి, రాజగోపాల్‌పేట ఎం.శివరాజు, పాలమాకుల పి.మమత, బద్ధి పడగ, దర్గాపల్లి, జేపి తండా జి.రమేష్, ముగ్ధంపూర్,రాంపూర్ ఎస్.రవీందర్, కోనాయిపల్లి, వెంకటా పూర్, తిమ్మాయిపల్లి ఈ నియామకాలతో మండలంలోని గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయని తహశీల్దార్ వివరించారు.జీపీఓలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## వైన్స్ టెండర్లలో అరెకటికలకు 30 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

**అరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** వైన్స్ టెండర్లలో అరెకటికలకు 30 శాతం రిజర్వేషన్ కేటాయించాలని అరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజభీంకర్ బొంపల్లి అశోక్ అన్నారు. రాష్ట్ర అరెకటిక అభివృద్ధి సంఘం నాయకులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెకటికలు అనాటి నుంచి నేటీ వరకు కుల వృత్తిగా మాంసం విక్రయిస్తున్నారని తెలిపారు. అరెకటికల కుల వృత్తి అయిన మాంసం విక్రయాలు సరిగా లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అరెకటికల కుల వృత్తి మాంసం వ్యాపారానికి భద్రత కల్పిస్తూ వ్యాపారం చేసుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. మాంసం వృత్తిని అరెకటికలకు పేటెంట్ చేయాలన్నారు. నూతన ఎక్సైజ్ పాలసీలో వైన్ టెండర్లలో 30 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పోతారెడ్డిపేట గజంకర్ అశోక్, బాలకిషన్, రమేష్, మక్కాజి మధు, బాలరాజు, ఈశ్వర్‌లాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దామోదర్ రాజనర్సింహ

## సమాజంలో మార్పు గురువులతోనే సాధ్యం

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**జోగిపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం అందోలు నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని సంగుపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లితండ్రుల తర్వాత గురువులదే ప్రధానమైన భూమిక అని ఆయన అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావటం కేవలం ఉపాధ్యాయులతోనే సాధ్యపడుతుందన్నారు. వివిధరకాల శాఖలకు తాను మంత్రిగా పని చేసానని, అయితే విద్యాశాఖ చాలా ఇష్టమని ఆయన పేర్కొన్నారు. యువతను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులని, వారిని సన్మానించుకోవటం మన అదృష్టంగా భావించాలన్నారు. అందోలు నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా ఉన్నత విద్యావకాశాలు అందుబాటులోకి తీసుకురావటం జరిగిందని, జెఎన్‌టియు లాంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థను అందోలుకు తమ హయాంలోనే తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా బాలికా విద్యకు భద్రత, కనీస సౌకార్యాలు చాలా అవసరమని, వీటి కోసం నియోజకవర్గంలో ఇప్పటికే 15 కోట్ల రూపాయలు వెచ్చించామని, మరో ఇరవై కోట్ల వరకు అవసరమౌతాయని ఆయన తెలిపారు. అనంతరం నియోజకర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఏ.మాణయ్య, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్ మక్త జగన్మోహన్ రెడ్డి, మండల విద్యాధికారి క్రిష్ణ, పిఆర్‌టియు అందోలు అర్బన్, రూరల్ శాఖల అధ్యక్షులు నరోత్తం, రాజమల్లు, పిఆర్‌టియు నేతలు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ పూర్వ వైభవానికి కృషి

**-టెలికం బోర్డు డైరెక్టర్ వైద్యనాథ్**



రంజోల్ వైద్యనాథ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

**జహీరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** జహీరాబాద్ ప్రాంతంతో పాటు జిల్లాలో బిఎస్ఎన్ఎల్ పూర్వవైభవానికి కృషిచేస్తానని నూతనంగా నియామకం అయిన జిల్లా టెలికాం బోర్డు అడ్వైజర్ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ రంజోల్ వైద్యనాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అతిథి హోటల్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి వైద్యనాథ్ మాట్లాడుతూ తనను టెలికం బోర్డు కమిటీ డైరెక్టర్‌గా నియామకం అయ్యేలా సహకరించిన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కౌడిపల్లి మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

**గిరిజన సంక్షేమ పాఠశాల, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిశీలించిన కలెక్టర్**



ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కౌడిపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ముక్రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కౌడిపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్కూల్ బిల్డింగ్ నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మండల పరిధిలోని ముక్రాజ్‌పల్లిలో ఇటీవల గ్యాస్ ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితుడు ఆకుల శ్రీనివాస్‌ను పరామర్శించారు. ధ్వంశమైన ఇంటిని పరిశీలించి గ్యాస్ లీకేజ్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని చెప్పారు. రెగ్యులేటర్ గ్యాస్ పైప్ కాలం చెల్లగానే ఎప్పటి కప్పుడు మార్చుకుంటూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం గ్రామ పరిసరాలను పరిశీలించి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. పంచాయతీ శాఖ ద్వారా పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టి దోమలను నిర్మూలించేందుకు స్ప్రే మందులు వాడాలని ఆయన తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కౌడిపల్లి ఆశ్రమం పాఠశాల బిల్డింగ్ పురాతన కట్టడం గుర్తించడం జరిగిందని, సాధ్యమైనంత తొందరలో కూల్చివేసి నూతన పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. రుచి సూచితో కూడిన నాణ్యమైన మెనూ వేడివేడి ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందికి సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీడీవో శ్రీనివాస్ తహసిల్దార్ కృష్ణయ్య ఆర్ఐ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.

## అర్జున్ తండాలో మహిళ అదృశ్యం

**నర్సాపూర్ రూరల్, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** మండల పరిధి అర్జున్ తండా(తుజాల్‌పూర్) మహిళ అదృశ్యం అయినట్లు ఎస్ఐ జగన్నాథం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం...అర్జున్‌తండాకు చెందిన కుబ్యా పెద్ద కొడుకు పవన్‌కు 3 సంవత్సరాలక్రితం గండిమైసమ్మ, దుండిగల్‌కుచెందిన బానోతన మౌనికతో వివాహం జరిగింది. అయితే పవన్‌కు మానసికస్థితి సరిగ్గా ఉండక పోవడంతో రెండు సంవత్సరాల క్రితం సంసార విషయంలో గొడవ కావడంతో పుట్టింటికి వెళ్లిపోయింది.ఈనెల 8వ తేదీన పెద్దల సమక్షంలో మాట్లాడుకొని రాజీకుదుర్చుకున్నారు. దీంతో మౌనిక అర్జున్‌తండాలోని ఇంటికి వచ్చింది. 11వ తేదీన బహిర్భూమికి వెళ్లివస్తానని భర్త పవన్‌కు చెప్పివెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఈ విషయం తండ్రి కుబ్యాకు ఫోన్‌లో తెలిపాడు. మౌనిక గురించి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీలభించలేదు. మౌనిక మామ కుబ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ జగన్నాథం తెలిపారు.

# ఉద్యోగ నియామకాలను వెంటనే పూర్తిచేస్తాం

**ఉద్యోగాల నియామకాలలో నిరుద్యోగులు ఆందోళన చెందవద్దు.. రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ఎల్లమ్మ చెరువులో పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్న ం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త**

గ్రూప్ 1 పరీక్షకు సంబంధించి కోర్టు నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకుని బిఆర్ఎస్, బిజెపిలు రాక్షసానందం పొందుతున్నారని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువును సందర్శించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో తెలంగాణ పోరాటానికి మైలురాయిన నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమై పెండింగ్‌లో ఉన్న పరిస్థితులలో సమస్యలన్నిటిని పరిష్కరించి 65 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణ విషయంలో కొన్ని లోపాలు ఉన్నాయని, మరికొన్ని కారణాలతో కోర్టు ఒక నిర్ణయం తీసు కోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎక్కడైనా న్యాయపరమైన చిక్కులు ఉంటే వాటిని అధిగమించి ముందుకు సాగాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉద్యోగాల నియామకాల విషయంలో నిరుద్యోగులు ఆందోళనచెందాల్సిన అవసరంలేదని, త్వరలో జాబ్ క్యాలెండర్ వస్తుందన్నారు. ఉద్యోగాల నియామకాల ప్రక్రియను వెం టనే పూర్తి చేస్తామని, అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రతి పక్ష పార్టీలు కోర్టు ఏదో చెప్తే దాంతో రాక్షసానందం, పైశాచికానందం పొందొద్దన్నారు. నిరు ద్యోగుల పక్షాన నిలబడి వారికి అండగా ఉండి బాధ్యత గల సూచనలు ఇవ్వాలని వారికి సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి...**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని లబ్ధి దారులను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హుస్నా బాద్ మండలం తోటపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కళాశాలలో నూతనంగా ఏర్పడ్డ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలి పారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మొదటి సంవత్సరంలోనే అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశామన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే విసి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యం కోసం 30 ఎకరాలలో శాతవాహన యూనివర్సిటీ కళాశాల సొంత భవనం నిర్మిస్తామన్నారు. కళాశాల సొంత భవన నిర్మాణానికి సిఎం రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చి భూమి పూజ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, డిపివో దేవకిదేవి, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు ఉన్నారు.

**అక్కన్నపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...**

**అక్కన్నపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :**

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అక్కన్నపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శుక్రవారం మండలంలోని మల్లంపల్లి నుండి చౌటపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ 1కోటితో, మల్లం పల్లి నుండి తాళ్లతండా వరకు బిటి రోడ్డు నిర్మాణం కోసం రూ2.4కోట్లతో, 1 కోటి 72 లక్షల వ్యయంతో యాటకర్లపల్లి నుండి మంచినీళ్ల బండ వరకు పిఆర్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ తోపాటు మండలంలోని మంచినీళ్ల బండ గ్రామంలో 20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అక్కన్నపేట మండలాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఈ మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో భాగంగానే మండలానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయ, సబ్‌స్టేషన్‌లు మంజూరు చేశామని, రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి కార్యక్రమంలో మండల ప్రజలు భూ సమస్యలు పరిష్కరించుకుని జిల్లాలో రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. గైరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి కాల్వల పేమెంట్స్ జరుగుతున్నాయన్నారు. కాల్వల నిర్మాణం కోసం రైతులు సహకరించాలని కోరారు. గడిచిన పదేళ్లలో లేని విధంగా అందరికి రేషన్‌కార్డు లతో పాటు ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిపివో, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ లింగ మూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

## పేదలు ఆర్థికంగా ఎదగడానికే జిఎస్టీ తగ్గింపు

**ఎంపి రఘునందన్‌రావు**

**గజ్వేల్, సెప్టెంబరు 7 (ప్రభాతవార్త):** పేదలు మధ్యతరగతి కుటుంబాలతో పోటీపడాలనే ఉద్దేశంతోనే ప్రధాని నరేంద్రమోడి జిఎస్టీని తగ్గించారని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని అయ్యప్ప దేవాలయంలో జిఎస్టీ తగ్గింపుపై వర్తక, వ్యాపార సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుండి 193 దేశాలలో నాలుగైదుసార్లు ప్రధానమంత్రులు మారారని, 11 సంవత్సరాలుగా భారతదేశ ప్రధానిగా ఏకతాటిగా ఏలుతున్న గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్రమోడి అన్నారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో మారణ హోమాన్ని చూస్తున్నామని, ప్రపంచంలోనే దేశ గౌరవాన్ని పెంచిన నరేంద్రమోడిని మించిన నాయకుడు లేడన్నారు. మెదక్ ప్రజల ఆశీస్సులతో ఎంపిగా గెలిచానని, నామీద పోటీచేసిన వ్యక్తి రూ.250 కోట్లు ఖర్చుపెట్టినా మోడి చేపట్టిన సంక్షేమ పథకాలే నన్ను గెలిపించాయన్నారు. పేదలకు కొనుగోలు శక్తి పెరగాలనే ఉద్దేశంతోనే జిఎస్టీ తగ్గించారని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి మంచి అవకాశమన్నారు. జిఎస్టీ తగ్గింపు ద్వారా స్టీల్, సిమెంట్ ధరలు తగ్గాయని, అదేవిధంగా ఫ్రిజ్, కారు, హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు నిత్యావసర సరుకులపై సైతం ధరలు తగ్గాయన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోఉన్న వర్తక, వ్యాపారులు అందరూ తమ దుకాణం ఎదుట స్వదేశీ వస్తువులు మాత్రమే అమ్ముతామని బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 30 కోట్ల జనాభా లేని అమెరికా భారతదేశంపై విమర్శలు చేస్తుందని, ట్రంప్ బరితెగించి మాట్లాడుతున్నారన్నారు. అమెరికాలో భారతదేశానికి సంబంధించిన వారు పనిచేయకపోతే అమెరికాకు చెందిన వారు పది శాతం కూడా ఉండరని, ప్రపంచంలోనే భారతదేశానికి గొప్ప గౌరవం ఉందన్నారు. హర్ గర్ స్వదేశీ అనే నినాదంతో ట్రంప్ గింప్ జాంతానయ్ అనే సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న రోజుల్లో విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. నరేంద్రమోడి తీసుకున్న జిఎస్టీ తగ్గింపు నిర్ణయం వర్తక, వ్యాపారులు కొనుగోలుదారులకు తగ్గించి ఇచ్చి సహకరించాలన్నారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, నలగామ శ్రీనివాస్, నందన్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, యెల్లు రాంరెడ్డి, సింగం సత్తయ్య, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్, కిరాణా, బట్టల వర్తక సంఘం, స్వర్ణకార సంఘం, రేషన్ డీలర్ల సంఘం, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలి : ఏసిపి




మాట్లాడుతున్న ఏసిపి నరసింహులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 12 (ప్రభాతవార్త):** చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకుండా ఏకాగ్రతతో విద్యాను అభ్యసించాలని గజ్వేల్ ఏసిపి నరసింహులు తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి నరసింహులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే పరిణామాలు, ఇవిటీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సోషల్ మీడియా యొక్క పరిణామాలు, సైబర్ క్రైమ్స్, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యతపై వివరించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి తెలిపారు. విద్యార్థినిలను ఎవరైనా వేధించినా, రోడ్డుపై అవహేలనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నెం.8712667434, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, గజ్వేల్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్యామల, రామచంద్రారెడ్డి, మహేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



అల్లాదుర్గంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌వద్ద మంటలు చెలరేగిన దృశ్యం

## ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

**తప్పిన పెను ప్రమాదం**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్ పార్మర వద్ద అగ్గి రాజుకోవడంతో ఎక్కడ ట్రాన్స్ ఫార్మర్ పేలిపోతుందో అని దుకాణాలదారులు, పాదచారులు భయాందోళనతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా ఆపేయడం, నీటితో మంటలను ఆర్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ట్రాన్స్ ఫార్మర్ వద్ద తరుచూ మంటలు వస్తున్నాయని విద్యుత్ అధికారులకు ఫిర్యాదుచేస్తున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి మండలస్థాయి అధికారుల పర్య వేక్షణ లేమితో కింది స్థాయి అధికారులు ఇష్టారీతిగా మండలంలో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తూ విధులు నిర్వహిస్తుండ టంతో సమస్యలను పరిష్కరించలేకపోతున్నారని,అధికారులు,సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఇసుక ట్రాక్టర్ల సీజ్

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. మండల పరధి ధర్పల్లి శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు చేసి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## కారు బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

**చౌటకూరు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** మండల కేంద్రం సమీపంలో సంగారెడ్డి-నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి కారు బోల్తాపడింది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చౌటకూరుకు చెందిన ఎద్దరూర్ ఎల్లయ్య (28) స్విఫ్ట్ డిజైర్ కారు(టీఎస్ 16 ఈపి 8609)లో సంగారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ వద్ద జాతీయ రహదారిపై పల్టీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో ఎల్లయ్యకు గాయాలు కాగా ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందచేసి క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.



జాతీయ రహదారిపై బోల్తాకొట్టిన కారు

# పక్కదారి పడుతున్న యూరియా..!?

**ఒక్కో బస్తాకు రూ 500 వసూలు చేస్తున్న దళారులు.. అక్కన్నపేట మండలంలో పట్టుబడ్డ యూరియా బస్తాలు.. కేసు నమోదు**



యూరియా బస్తాలు ఎక్కడి నుండి వచ్చాయని అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయశాఖ అధికారులు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొంత మంది దళారులు ఫర్టిలైజర్, వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై యూరియాను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఎరువుల దుకాణాలకు యూరియా వస్తున్న విషయం ముందుగానే తెలుసుకుంటున్న దళారులు కొంతమంది ఫర్టిలైజర్ నిర్వాహకులతోపాటు వ్యవసాయ అధికారుల అండతోనే వచ్చే బస్తాలలో కొంత మేరకు మాత్రమే టోకెన్ల పేరుతో లైన్లో ఉండే వారికి పంపిణీ చేసి మిగిలిన బస్తాలను వారికి అనుగుణంగా ఉండే దళారుల పేర్లు, ఆధార్ నంబర్లతో ఆన్‌లైన్ చేసి పక్కదారి పట్టిస్తున్నట్లు వినిపిస్తుంది.అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల నిల్వలు ఎంతమేరకు ఉన్నాయి? ఏఏ ఎరువులను ఎంత ధరకు విక్రయిస్తున్నారు అనేది అక్కడ బోర్డు ఏర్పాటుచేయాల్సి ఉన్నా అధికారుల పట్టించుకోకపోవడంతో ఫర్టిలైజర్, దళారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రెండు నెలలుగా ఎరువులు దొరకక రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్కడికైతే యూరియా వస్తుందో అక్కడ చెప్పులు, పాసుపుస్తకాల జిరాక్సులు లైన్లో పెట్టుకోవడంతోపాటు లైన్లో నిలబడి ఇబ్బందులు పడుతుంటే వారి అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న దళారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి పక్కదారిన నిల్వచేసిన యూరియా బస్తాలను రహస్య ప్రదేశాలలో దాచుకుని అమాయకులైన రైతులకు ఒక్కో బస్తాకు రూ 250 నుండి మూడు వందల వరకు ఎక్కువ వసూళ్లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే నిబంధనల ప్రకారం ఒక యూరియా బస్తాకు ఎంఆర్‌పి రూ. 266.50 పైసలు ఉండగా ఒక్కో బస్తాకు కేంద్ర ప్రభుత్వం రూ 1967 సబ్సిడి చెల్లిస్తుంది. అయితే దీని ధర మొత్తం 2234 ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.అంటే దళారులు అమ్మే ఒక్కోబస్తాకు రైతులు మూడు వందల వరకు నష్టపోతుండగా ప్రభుత్వానికి ఒకే బస్తాకు 2వేల వరకు నష్టం జరుగుతుంది. ఏదిఏమైనా రైతులకు నేరుగాఅందాల్సిన యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అటు రైతులను మోసం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అబాసుపాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న దళారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అక్కన్నపేట మండలంలో పట్టుబడ్డ యూరియా బస్తాలు...**

అక్కన్నపేట మండలంలోని నందారం గ్రామంలో శుక్రవారం కరివేద సంజీవరెడ్డి ఇంట్లో వందలాది యూరియా బస్తాలను అక్రమంగా నిల్వ చేసి ఒక్కో బస్తాకు రూ.500 చొప్పున విక్రయిస్తున్నారని గ్రామస్థులు వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తనకు నాలుగు యూరియా బస్తాలు కావాలని సంజీవరెడ్డిని అడగగా ఒక్కో బస్తాకు రూ. 500 చొప్పున మొత్తం 2 వేలు ఇస్తే ఇస్తానని చెప్పడంతో ఈ విషయం బయటకు వచ్చినట్లు తెలుస్తుంది.

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు**

అక్కన్నపేట మండలంలోని నందారం గ్రామానికి చెందిన కరివేద సంజీవరెడ్డి ఇంట్లో అక్రమంగా యూరియా నిల్వ చేసి విక్రయిస్తున్నారని విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అక్రమంగా నిల్వ చేసిన 9 బస్తాలను సీజ్‌చేశారు. ఆ బస్తాలు అతని వద్దకు ఎలా వచ్చాయని ఆరా తీశారు. ఈ విషయంలో అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్వరూపరాణితో కలిసి ఫిర్యాదు చేయగా ఎస్ఐ చాతరాజు ప్రశాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు నిర్వహించారు.

## సోషల్ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఎంఈఓ



సోషల్ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వాసర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట్ మండలాల యుపిఎస్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల ఉపాధ్యాయులతో సోషల్ సబ్జెక్ట్‌పై కాంప్లెక్స్ సమావేశాన్ని శుక్రవారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల రెండవవారంలో జరుగనున్న ఎఫ్‌ఎ2 పరీక్షల మాదిరి ప్రశ్నాపత్రం ఏకీకృతంగా అన్ని మండలాల్లో ఒకే విధంగా ఉండేలా తయారు చేయాలని సూచించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఏయేమేరకు అమలవుతున్నాయని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, కోర్సు డైరెక్టర్లు పాఠశాలల వారీగా రివ్యూచేయాలని సూచించారు. రాబోయే నెలలో జరుగవలసిన పాఠాలను పిల్లలకు ఎలా సులువుగా బోధించాలి అనే అంశాలు, ఇంకా సబ్జెక్టు వారీగా వస్తున్న నూతన పోకడలపై చర్చ జరపాలని సూచించారు. తెలంగాణ యాప్‌నందు ఫీడ్ బ్యాక్‌ను తెలియచేసి చెక్‌ఔట్ కావాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంజు, దేవి, దేశ్‌పాండే, ఉపాధ్యాయులు శివ కుమార్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయండి

**-కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు కార్పొరేటర్ వినతి**




ఆర్‌వి కర్ణన్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల నిర్వహణకు నిధులు మంజూరుచేయాలని కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. హైద్రాబాద్‌లోని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలుసుకుని అభివృద్ధి పనుల కొరకు 2కోట్ల రూపాయల నిధుల మంజూరు కొరకు ప్రతిపాదనలు అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌ఐజి కాలనీ బస్‌స్టాప్ నుంచి మ్యాక్ సొసైటీ అంబేద్కర్ విగ్రహం వరకు రహదారి, ఎంఐజి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌కు ప్రతిపాదనలు అందచేశామన్నారు. డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను, అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించినట్లు వివరించారు.

## మాజీ మంత్రిని కలిసిని బిఆర్ఎస్ నేతలు



హరీశ్‌రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేతలు

**పుల్‌కల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బిఆర్ఎస్ నేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో చౌటకూరు, పుల్‌కల్ మండలాల బిఆర్ఎస్ నేతలు కలుసుకున్నారు. పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న హరీష్‌రావుపై లేనిపోని ఆరోపణలు వస్తుండటంతో హరీష్‌రావుకు మద్దతుగా ఆయామండలాల పార్టీనాయకులు ప్రత్యేకవాహనాల్లో తరలి వస్తూ సంఘీభావం వ్యక్తంచేస్తూ తమ మద్దతు మీకే అంటూ ధైర్యాన్ని ఇస్తున్నారు. మాజీమంత్రిని కలిసినవారిలో పుల్‌కల్, చౌటకూరు మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు మాచర్ల విజయకుమార్, చౌకంపల్లి శివకుమార్, ఉమ్మడి పుల్‌కల్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు బక్కారెడ్డి కిష్టారెడ్డి, నాయకులు పడమటి రమేష్, కిషన్‌గౌడ్, తుండె ఆనంతి, రాజాగౌడ్, జాఫర్, మొగులయ్య, దేవయ్య, కరణం హన్మంతరావు, మల్లారెడ్డి, దర్శన్‌రెడ్డి, పల్లె చంద్రశేఖర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహం విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ అవసరం

**-ఎంపిడిఓ చంద్రశేఖర్**



వసతిగృహం విద్యార్థులతో సమావేశం అయిన ఎంపిడిఓ చంద్రశేఖర్

**అల్లాదుర్గం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
వసతిగృహంలో ఉంటూ విద్యను అందుకుంటున్న విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం అల్లాదుర్గంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మంచి విద్యను అందించేలా అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్న వార్డెన్ కిషోర్‌ను ఎంపిడిఓ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆత్మహత్యల నివారణకై అవగాహన ర్యాలీ

**జోగిపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
ఆత్మహత్యల నివారణపై అవగాహన ర్యాలీని శుక్రవారం జోగిపేటలో నిర్వహించారు. అందోలులోని నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఈర్యాలీ చేపట్టారు. జోగిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీ చేపట్టి జోగిపేట ప్రధానరహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ఆత్యహత్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఆత్మహత్యలతో సాధించేదేమి ఉండదని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరంలో సెప్టెంబర్ మాసంలో ఆత్మహత్యల నివారణకు అవగాహన ర్యాలీ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో త్వరలో కోర్సులు

**-యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు**
**-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**



కోహీర్ చౌరస్తాలోని హోటల్ మేనేజ్మెంట్ కళాశాలను సందర్శిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**జహీరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కోహీర్ చౌరస్తాలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎన్‌ఐటిహెచ్‌ఎం డైరెక్టర్ వెంకటరమణలతో కలిసి సందర్శించారు. గత రెండు సంవత్సరాలుగా వినియోగంలో లేని భవనాన్ని పరిశీలించి తక్షణమే భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ త్రాగునీరు, విద్యుత్, శుభ్రతలాంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసి భవనాన్ని విద్య, శిక్షణ కేంద్రంగా మార్చాలన్నారు. భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి స్కిల్ డెవలప్‌మెంట్‌లో, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, ఒరియంటేషన్ కార్యక్రమాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తి కాలం కోర్సులు కాకుండా సర్టిఫికేషన్, షార్ట్‌టర్మ్ కోర్సులు ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇందిరా మహిళాశక్తిసంఘాలకు, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు, బేకరీ ఐటమ్ తయారీ శిక్షణ అందేవిధంగా కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఐటిహెచ్‌ఎం డైరెక్టర్ వెంకటరమణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామాచారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి అనిల్, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ తుల్జానాయక్, జహీరాబాద్ ఆర్‌డిఓ దేవుజా, రెవిన్యూ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు కొంటున్నారా? జర జాగ్రత్త..

**-సిఐ వెంకట్‌రెడ్డి**

**సిర్గాపూర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
కంగ్టి సర్కిల్ పరిధిలోని కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్ పోలీసు ఠాణాల పరిధిలో వ్యవసాయ భూములు కొనేముందు జాగ్రతలు పాటించాలని సిఐ వెంకట్‌రెడ్డి సర్కిల్ ప్రజలకు సూచించారు. లోయల్లో, ప్రాజెక్టులో మునిగిన, గుట్టల మధ్య ఉన్న భూమిని రోడ్డు పక్కన ఉందని తక్కువ ధరకు ఇప్పిస్తామని నమ్మించి కొందరు బ్రోకర్లు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని సిఐ వెంకట్‌రెడ్డి గుర్తుచేశారు. రైతులకు భూమి అమ్మే ఇష్టంలేకున్నా కొంత డబ్బు ఇస్తాం అంటూ నమ్మించి అగ్రిమెంట్ మీద సంతకాలు పెట్టించుకుని కొంత సొమ్ము అందించి రిజిస్ట్రేషన్ విషయంలో గొడవలకు దిగుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయభూములు కొనేముందు నేరుగా రైతులతో సంప్రతించి జాగ్రతలు తీసుకుని కొనుగోలుచేయాలని సిఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

## నామాపూర్ పాఠశాల పరిశీలించిన డిఈఓ



ఫోటో1ః నామాపూర్ పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

**పాపన్నపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పాపన్నపేట మండల పరిధిలోని నామాపూర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ పరిశీలించారు. ఆ పాఠశాలలో 45మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఒకేగది ఉండడంతోపాటు అదికూడా శిథిలావస్థకు వచ్చింది. విషయంతెలుసుకున్న అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వైద్య సలహాదారు, పాపన్నపేట ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థి అయిన డాక్టర్ మన్నే ఉపేందర్, ఆపాఠశాలను మరమ్మతు చేయడానికి ముందుకు వచ్చారు. విషయంతెలుసుకున్న డిఈవో పాఠశాలను పరిశీలించి, పాఠశాల పైకప్పు శిథిలావస్థకుచేరిందని దాన్ని మరమ్మతుచేయడంతోపాటు, నూతనంగా ఒక రేకులషెడ్డు వేయాల్సిందిగా ఉపేందర్ దృష్టికి తీసుకెళ్లారు. డిఇఓవెంట మండలవిద్యాధికారి ప్రతాపరెడ్డితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**-ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్**

**పాపన్నపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చికోడ్ లింగాయిపల్లి ప్రభుత్వ బాలుర వసతిగృహంలో మెడికల్‌క్యాంపు, పేరెంట్స్ మీటింగ్‌ను హాస్టల్‌వార్డెన్ జి.శ్రీనివాస్ నిర్వహించారు. ఈసందర్భంగా పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్లు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి కావలసిన మందులందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వారి సందేహాలను కూడా నివృత్తి చేసుకొన్నారు. కార్యక్రమంలో పాపన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ క్రాంతికుమార్, శ్రీనివాస్, ఎఎన్‌ఎం సరిత, గ్రామపంచాయతీ సెక్రటరీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెవైఎం మండల అధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి

**గుమ్మడిదల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం బిజెవైఎం మండల అధ్యక్షుడిగా అమ్మగారి అనిల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, యువతను సంఘటితంచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## రామచంద్రాపురంలో అభివృద్ధి పనులు

**-భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే**



అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
ప్రజల అవసరాలకు అనుగుణంగా రామచంద్రాపురం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పనులతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో రూ.3కోట్ల20లక్షలతో చేపట్టే థీమ్‌పార్క్ పనులకు, రూ.1కోటి 7 లక్షలతో కాకతీయనగర్ కాలనీలో యుజిడిలు, సిసిరోడ్ల నిర్మాణ పనులకు, రామచంద్రాపురం స్మశానవాటికలో రూ.1కోటి98లక్షల రూపాయలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్‌కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్‌తో ఎమ్మెల్యే కలిసి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ధ్వంసమైన రహదారుల స్థానంలో నూతన రహదారులు నిర్మిస్తున్నామన్నారు. కాలనీలో ప్రభుత్వస్థలాలు ఉన్నచోట్ల థీమ్ పార్కులు నిర్మిస్తూ ప్రజలు ఆహ్లాదంగా సేదతీరేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగడ్డ నగేష్, పరమేష్ యాదవ్, ఐలేష్‌యాదవ్, రాజు, రాజేష్, జిహెచ్‌ఎంసి ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసిసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**-బిహెచ్‌ఈఎల్ ఆర్టీసి డిపో మేనేజర్ సుధా**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
టిజిఎస్ ఆర్టీసి అందిస్తున్న వినూత్న సేవాకార్యక్రమాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిహెచ్‌ఈఎల్ ఆర్టీసి డిపో మేనేజర్ సుధా పేర్కొన్నారు. శుక్రవారం డిపోమేనేజర్ సుధా మాట్లాడుతూ వ్యక్తుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండగలు, పెళ్లిలు తదితర శుభకార్యాల వంటి ఆనందకరమైన రోజుల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులను, దివ్యాంగులను, నిరుపేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలకు, పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకెళ్లడం చేస్తున్నామన్నారు. హైద్రాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం యాత్రాదానం కార్యక్రమం పోస్టర్‌ను రవాణాశాఖ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించినట్లు గుర్తు చేశారు. యాత్రాదానం కింద బస్సులను బుకింగ్ చేసుకునేందుకు బిహెచ్‌ఈఎల్ ఆర్టీసి డిపో అధికారులను సంప్రతించాలన్నారు. పూర్తివివరాలకు 7382814249/ 9391072283/9063401072లను సంప్రతించాలని మేనేజర్ సుధా సూచించారు.

## విజయవంతమైన ఉచిత సంతానసాఫల్య వైద్యశిబిరం

**పెద్దశంకరంపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేటలోని హాసిని గాయత్రి ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా వచ్చిన మహిళావైద్యులు సీత గరిమెళ్ళ, కె.శ్వేతలు ప్రత్యేకంగా దాదాపు 35మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హాసిని గాయత్రి ఆసుపత్రిలో ఎవరైనా మహిళ కాన్పు చేయించుకుంటే ఆడపిల్ల పుడితే ఎలాంటి రుసుములేకుండా వైద్యం నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు శంకర్ రాథోడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొట్టుకుపోయిన కల్వర్టు

**-బ్రిడ్జ్ నిర్మించాలని విజ్ఞప్తి**
**-ప్రతి వర్షాకాలం ఇదే పరిస్థితి**



**నిజాంపేట్ సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా శాఖపూర్(161) జాతీయ రహదారి నారాయణఖేడ్ బీదర్ వెళ్లే రోడ్డు మార్గంలో (1) ఉన్నందున ఇటీవల ఆగస్టు నెలలో భారీ వర్షం కురవడంతో ఊరికి వెళ్లే దారిలో భీమునిచెరువు అలుగు పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో నిత్యావసరాలు, సరుకులు, హాస్పిటల్‌కు వెళ్లాలంటే నరకయాతన. ఎక్కడకీ వెళ్లడానికి కూడా మార్గంలేదు. అలాగే అన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయని, భారీ వర్షం వస్తే ఇళ్ల నుంచి బయటకు వెళ్లే మార్గం కూడా లేదు అని గ్రామప్రజలు అంటున్నారు. అలాగే గతంలో కూడా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బ్రిడ్జి నిర్మించాలని వేడుకున్నాం. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాసనసభ్యులు సంజీవరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. పలుమార్లు ప్రజాప్రతినిధులకు దృష్టికికూడా తీసుకెళ్లామని అన్నారు. అలాగే రోడ్డు మార్గం కూడా లేదు. మట్టి రోడ్డుపై గుంతలుపడి తీవ్రమైన అంతరాయం కలుగుతుందని, వెంటనే రోడ్డు సౌకర్యం కూడా చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ఇటీవల ఎస్పీ పారితోష్ పంకజ్, సబ్‌కలెక్టర్ ఉమాహారతి, ఎమ్మార్వో కూడా సందర్శించిన విషయం తెలిసిందే. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ డివిజన్ ఆఫీసర్ ఎఈ మేఘన ఉన్నతాధికారులను కలిసి శాఖపూర్ ప్రజలకు నిరంతరాయంగా, సురక్షి తమైన రాకపోకలు భీమునిచెరువు అలుగుపారే దగ్గర బ్రిడ్జి నిర్మించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ డివిజన్ ఆఫీసర్ ఎఈ మేఘన, సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

## నేడు లోక్ అదాలత్

**సిర్గాపూర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
ఈ నెల 13న నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీమార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్‌లో కేసును (యాక్సిడెంట్, కొట్లాట, భూతగాదాలు, భార్యాభర్తల జగడం, అక్రమరవాణా లాంటివి) రాజీపడి పరిష్కరించుకుంటే డబ్బులతో పాటు సమయం ఆదా అవుతుందని కక్షిదారులకు ఎస్‌ఐ సూచించారు. రాజీచేసుకునే వారు (కక్షిదారులు, నేరస్థుడు) తమ ఆధార్‌కార్డులతో పోలీసుఠాణాకు లేదా కోర్టుకు చేరుకుని రాజీకుదుర్చుకుంటే కేసులు పరిష్కారం అవుతాయని, కక్షిదారులు, నేరస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ మహేష్ మండల ప్రజలకు సూచించారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



పేదలకు రేషన్‌కార్డులు అందచేస్తున్న కాంగ్రెస్ నేతలు

**చౌటకూరు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్‌ప్రభుత్వం పాలన సాగిస్తోందని మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామంలో రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరయిన రేషన్‌కార్డులను శుక్రవారం లబ్దిదారులకు అందించి రేషన్‌బియ్యం అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల మహేష్, చంటి రమేష్, నలగండ్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ నేతలు



హరీష్‌రావును కలిసిన రాయికోడ్ బిఆర్ఎస్ నాయకులు

**జహీరాబాద్(రాయికోడ్), సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును శుక్రవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో రాయికోడ్ మండల బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా హైద్రాబాద్‌లోని నివాసంలో కలుసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు (హరీష్‌రావుపై ఆరోపణలు)పై హరీష్‌రావుకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని హరీష్‌రావకు హామీ చేశారు. హరీష్‌రావును కలిసిన వారిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేవెళ్ల విఠల్, పీపడ్‌పల్లి మాజీ సర్పంచ్ జి.రవీందర్‌కుమార్, నాయకులు ఉన్నారు.

## బిఆర్‌టియు ఆటోయూనియన్ జెండా ఆవిష్కరణ

**-కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
గుమ్మడిదల బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థ బిఆర్‌టియు మల్లికార్జున ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో గుమ్మడిదల అంబేద్కర్‌చౌరస్తాలో, బొంతపల్లి కమాన్‌వద్ద ఏర్పాటుచేసిన బిఆర్‌టియు ఆటో యూనియన్ జెండాను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఎగురవేశాడు. ఈసందర్భంగా తమసొంతనిధులను వెచ్చించి ఆటోడ్రైవర్లకు జీవితభీమా స్కీమ్, గుర్తింపు కార్డులను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆటో యూనియన్ సంఘం సభ్యులు శివ, వీర, అశ్వరఖాన్ తదితరులు గోవర్ధన్‌రెడ్డితోపాటు మండలపార్టీఅధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని శాలువా, పూలదండలతో ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, హన్మంత్‌రెడ్డి చిమ్ముల నర్సింహారెడ్డి, తుపాకుల రాజు, మంద భాస్కర్‌రెడ్డి, బోయిన వేణు, జింక గోపాల్, ఊట్ల యాదిరెడ్డి, రుక్మారెడ్డి, సరహరి, పోర్చుగారి శ్రీనివాసరెడ్డి, కేబుల్ సంజీవరెడ్డి, చిమ్ముల దేవేందర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏచూరి స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తాం

**-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సాయిలు**




సీతారం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**జోగిపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
సిపిఎం పార్టీ అఖిలభారత జాతీయ మాజీ కార్యదర్శి సీతారం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమాలుకొనసాగిస్తామని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు అన్నారు. ఏచూరి ప్రథమవర్ధంతిని జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. దేశంలోని వివిధ పార్టీలను ఏకంచేసి ఇండియాకూటమి ఏర్పాటుకు కృషిచేసిన గొప్ప మేధావి ఏచూరి అని అన్నారు. కార్యక్రమంలో అందోలు డివిజన్ కార్య దర్శి విద్యాసాగర్, ఏరియాకమిటీ సభ్యులు రాములు, క్రిష్ణ, వెంకటేశం, మహేష్, యాదగిరి, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**వర్గల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
వర్గల్ మండలం సీతారాంపల్లి గ్రామానికిచెందిన అజ్మీరాధనరాజ్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోచికిత్స పొందాడు. ఎక్కువమొత్తంలో ఖర్చుకావడంతో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి సలహాతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు పెట్టుకోగా, సిఎంఆర్‌ఎఫ్ నుండి రూ.38,500 చెక్కు మంజూరు కాగా, ఆచెక్కును శుక్రవారం అనిల్‌రెడ్డి బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మహబూబ్, నరేందర్, భాస్కర్, నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.